Namasthe Telangana Dt- 15/12/17.

# మెట్రో ప్రయాణానికే మొగ్గు

- 16 రోజుల్లో 22 లక్షల మంది ప్రయాణం
- నాగోల్-మియాపూర్ మార్గంలో తగ్గిన రోడ్ ట్రాఫిక్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌వాసులు మెట్రోరైలులో ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు. మొదట్లో స్మార్ట్ కార్డుపై 5 శాతం రాయితీ ప్రకటించిన ఎల్‌అండ్‌టీ.. రాయితీని 10 శాతానికి పెంచడంతో మెట్రోరైలు ప్రయాణికుల సంఖ్య మరింత పెరుగుతున్నది. హైదరాబాద్ మెట్రోరైలు కేవలం 16 రోజుల్లోనే 22 లక్షల మందిని గమ్యస్థానానికి చేర్చింది. నిత్యం లక్ష మందికి తగ్గకుండా గమ్యస్థానాలకు చేర్చుతూ నగర రవాణాలో కీలకంగా వ్యవహరిస్తున్నది. గతంలో ట్రాఫిక్‌లో చిక్కుకొని సమయానికి ఆఫీస్‌లకు చేరుకోలేక ఇబ్బంది పడ్డ ఉద్యోగులకు మెట్రో రాకతో కష్టాలు తీరిపోయాయి. మెట్రోరైలు రాకతో నాగోల్ నుంచి మియాపూర్ మార్గంలో రోడ్లపై ట్రాఫిక్ తగ్గి గంటకు 5-10 కి.మీ. వేగం పెరిగినట్లు తెలిసింది. వాయు కాలుష్యంతోపాటు శబ్దకాలుష్యం కూడా తగ్గినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మెట్రోలో ఏసీ ప్రయాణ సౌకర్యంతోపాటు వ్యక్తిగత వాహనాలను ఉపయోగిస్తే వచ్చే ఖర్చును కూడా అంచనా వేస్తూ రైలు ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు.



మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో భారత సంతతి బృందం

## మెట్రో రైలుపై భారత సంతతి బృందం ప్రశంసలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌కు తొలిసారి వచ్చిన 40 మంది భారత సంతతి బృందం మెట్రో ప్రాజెక్టుపై ప్రశంసలు కురిపించారు. ప్రపంచస్థాయి నిర్మాణం, ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు అద్భుతమని కితాబిచ్చారు. గురువారం రసూల్‌పుర నుంచి అమీర్‌పేట వరకు ప్రయాణించిన వీరు మెట్రో రైలు వల్ల నగరానికి అనేక లాభాలు కలుగుతాయన్నారు. 'నో ఇండియా ప్రోగ్రాం' (కేఐపీ)లో భాగంగా తొమ్మిది దేశాలకు చెందిన 40 మంది భారత సంతతికి సభ్యులు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డితో రైలు భవన్‌లో సమావేశమై మెట్రో నిర్మాణం తీరును తెలుసుకున్నారు.